

క్యాన్సర్‌పై అందరికీ అవగాహన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

క్యాన్సర్‌పై అందరికీ అవగాహన అవసరమని డిఎంఅండ్‌హెచ్‌ఒ బి.మీనాక్షి అన్నారు. శనివారం డిఎంఅండ్‌హెచ్‌ఒ కార్యాలయం వద్ద క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మీనాక్షి మాట్లాడుతూ ప్రజలందరూ మంచి ఆహారపు అలవాట్లు, యోగా చేయడం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎడిఎంఅండ్‌హెచ్‌ఒ ఎన్.అనురాధ, పి.శ్రీదేవి, బి.వినోద్‌కుమార్, పి.వెంకటరమణ, వెంకటేశ్వరరావు, వి.శైలజ, కె.ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎంఅండ్‌హెచ్‌ఒ మీనాక్షి


రైతుల సమస్యలు వింటున్న సివిల్ సప్లై రాష్ట్ర కమిషనర్ అరుణ్ కుమార్

ఫిబ్రవరి 15 నాటికి లెవీ పూర్తి

సివిల్ సప్లై కమిషనర్ అరుణ్ కుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, పలాస, ఇచ్ఛాపురం

ఫిబ్రవరి 15వ తేదీ నాటికి ధాన్యం లెవీ సేకరణ పూర్తి చేయాలని సివిల్ సప్లై రాష్ట్ర కమిషనర్ హెచ్ అరుణ్ కుమార్ అన్నారు. శనివారం పలాస మండలం లక్ష్మీపురం ఆర్‌బికెను, ఇచ్ఛాపురం ఆర్‌బికెను జెసితో కలిసి సందర్శించారు. అనంతరం శ్రీకాకుళం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పండించిన పంటను త్వరగా నూర్పులు చేసి ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. పలాస మండలంలో ఇప్పటివరకు ఎన్ని క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు, ఎన్ని రైస్ మిల్లులు ఉన్నాయి, ఏయే ప్రాంతాల నుంచి ధాన్యం మిల్లులకు వస్తున్నాయి, ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్నారా? లేదా తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా రైతుల ధాన్యం కొనుగోలు చేసే విధంగా అధికారులు వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా గరుడకండి గోపాలపురం తదితర ప్రాంత రైతులు మాట్లాడుతూ మా ప్రాంతంలో ఆలస్యంగా ఉబాలు వేయడం జరిగిందని, మా ధాన్యాన్ని పలాస మండలంలో ఉన్న రైస్ మిల్లుకు తరలించేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ధాన్యం ఇచ్చిన వెంటనే డబ్బులు చెల్లించేలా చూడాలని రైతులు ఆయనను కోరారు. ఇచ్ఛాపురానికి చెందిన పలువురు రైతులు ధాన్యం కొనుగోలులో నెలకొన్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఇచ్ఛాపురం మండలానికి సంబంధించి సోంపేట, కంచిలి రైస్ మిల్లును ట్యాగ్ చేస్తున్నారని తెలిపారు. అనంతరం ఇచ్ఛాపురం ఆర్‌బికెలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. పలాస, ఇచ్ఛాపురం మండల అధికారులు పాల్గొన్నారు. శ్రీకాకుళంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్, సంయుక్త కలెక్టర్ యం.నవీన్, జిల్లా సరఫరాల అధికారి డి.వి.రమణ, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.జయంతి, ఏ.పి.మార్కెఫెడ్ జిల్లా మేనేజర్ కె.యు.పి.రమణి, జిల్లా సహకార అధికారి యస్.సుబ్బారావు, ఉప రవాణా కమీషనర్ సిహెచ్.శ్రీదేవి, రాగోలు పరిశోధన సంస్థ శాస్త్రవేత్త పి.ఉదయ్ బాబు, రౌతు సూర్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర దర్యాప్తుతో కేసుల పరిష్కారం

- గ్రేవ్ కేసులు వేగవంతం చేయాలి
- ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అపరిష్కతంగా హత్య, ఆత్మ హత్యాయత్నం, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ, వరకట్నం, ఆస్తి, మహిళలపై వేధింపులు వంటి కేసులను సమగ్ర దర్యాప్తు చేసి, పరిష్కరించాలని ఎస్‌పి జిఆర్.రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో గ్రేవ్ కేసులైన ఎస్‌సి, ఎస్‌టి, పోక్సో, తదితర కేసుల నమోదు, దర్యాప్తు, ముద్దాయిలు అరెస్టుపై సబ్ డివిజన్, సర్కిల్ వారీ పోలీసు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దర్యాప్తులో వెల్లడైన అంశాలు, సాక్ష్యాధారాలను బట్టి కేసు దర్యాప్తు పూర్తి చేసి, కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయాలని చెప్పారు. కేసుల దర్యాప్తులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సలహాలు పాటిస్తూ విచారణకు సరైన ఆధారాలతో కేసును బలోపేతం చేయాలని అన్నారు. ప్రతి కేసులోనూ ఫోరెన్సిక్ నిపుణుల ఆధారాలను కచ్చితంగా పొందాలన్నారు. పోక్సో ఎస్సీ ఎస్టీ కేసుల్లో సమగ్రమైన దర్యాప్తుతో కేసులు పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కేసుల నమోదు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు, ఛార్జిషీటు దాఖలు వరకు నిశితంగా పరిశోధన చేయాలని సూచించారు. కేసుల ఛేదింపు, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. నేరాల నివారణ, నేరస్తులను గుర్తించడానికి సాంకేతిక పరిజ్ఞానంతో నింధితలను గుర్తుంచాలని పేర్కొన్నారు. మహిళా పోలీసులతో గ్రామస్థాయిలో మహిళా చట్టాలు, దిశ యాప్‌పై విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ ఫిర్యాదులు అందిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశించారు. రహదారులపై నేరాలను నియంత్రించడానికి హైవే మొబైల్ నిరంతర గస్తీ నిర్వహించాలని, ప్రమాదాలు జరగడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను ముందస్తుగా గుర్తించి చర్యలు చేపట్టాలని అన్నారు.


మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

పండగ వేళ పటిష్ట చర్యలు

రానున్న సంక్రాంతి పండగ సందర్భంగా పట్టణ, గ్రామాల్లో పేకాట, కోడి పందేలు శిబిరాలపై దాడులు నిర్వహించాలని, అక్రమ మద్యం అమ్మకాలు, రవాణా, కల్తీ మద్యం అమ్మకాలను ముందస్తుగా గుర్తించి నియంత్రణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఎస్‌పి ఆదేశించారు. సమీక్షా సమావేశంలో అదనపు ఎస్‌పి(క్రైమ్) టిపి.విఠలేశ్వరరావు, డిఎస్‌పిలు మహేంద్ర, బాలరాజు, సిహెచ్‌జివి.ప్రసాద్‌రావు, శివరామిరెడ్డి, విజయకుమార్, వాసుదేవ్, సిఐలు పాల్గొన్నారు.

పెన్షన్ వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విశ్రాంత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో పెన్షన్లు చెల్లించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్‌పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.పార్వతీశం, ఎం.ఆదినారాయణ మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని సిఐటియు కార్యాలయంలో శనివారం నిర్వహించిన పెన్షనర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ వారం రోజులు గడిచినా ఇంతవరకు పెన్షన్ చెల్లించకపోవడంతో విశ్రాంత ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలు, వైద్య ఖర్చులు, ఇతర కారణాలతో ఆర్థిక సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు. అదనంగా పెరుగుతున్న ఖర్చులకు కొంతమేరకైనా ఆదుకునే అదనపు కరువుభత్యం తొమ్మిది విడతల బకాయిలు చెల్లించకపోగా, ఇప్పుడు సకాలంలో పెన్షన్ కూడా చెల్లించడం లేదని విమర్శించారు. డిఎ బకాయిలు చెల్లించకపోవడంతో నిజ పెన్షన్ విలువ నానాటికీ తగ్గుతోందన్నారు. ఉద్యోగులకు ఇస్తున్న పెన్షన్ ఎవరి దయ, భిక్ష కాదని, దశాబ్దాల తరబడి ఉద్యోగి అందించిన సేవలకు ప్రతిఫలమని సుప్రీం కోర్టు పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. పెన్షన్‌దారులకు ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. బకాయి ఉన్న కరువు భత్యం వెంటనే విడుదల చేయాలన్నారు. సమావేశంలో సంఘ జిల్లా కోశాధికారి పి.సుధాకరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎల్.అనంతరావు, సహాయ కార్యదర్శి పి.నరసింహరావు, కమిటీ సభ్యులు కె.సూర్యారావు, పి.నీలకంఠేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పార్వతీశం

ఎవరిది 'వై నాట్'

రాష్ట్ర రాజకీయాలు శీతాకాలంలో వడగాడ్పులు వీస్తున్నాయి. ఒకరు 175 సీట్లు లక్ష్యం ఎందుకు సాధించలేమని ప్రశ్నిస్తుంటే, మరొకరు ఆ పార్టీని భూస్థాపితం చేసేవరకు నిద్రపోనని శపథం చేస్తున్నారు. ఎవరి లక్ష్య సాధనలో పార్టీ పరిస్థితి, పాలనాతీరును ప్రజలు నిశితంగా పరిశీలిస్తున్నారు. అధికార పార్టీని భూస్థాపితం చేయడంతోనే నిద్రపోతానని చెప్పడమంటే ప్రజలను నిద్రపుచ్చుతారా! లేదా మేల్కొల్పి కార్యాచరణలోకి తీసుకుపోతారా అన్నది నేటికీ సమాధానం లేని ప్రశ్నగానే మిగిలిపోతోంది. ఈ పూర్వరంగంలోనే జిల్లా రాజకీయాలను కుడి, ఎడమగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. సంక్షేమ పథకాలే పార్టీకి జీవకర్రగా ఉన్నాయని, ఈ సారి విజయం సాధిస్తే మరో 30ఏళ్ల అధికారం మనదేనని ముఖ్యమంత్రి పార్టీ నేతలకు, కార్యకర్తలకు ఉద్బోధిస్తున్నారు. జిల్లాలో ఆ సంక్షేమం తాత్కాలిక ఊతకర్రగానే తోడ్పడుతోంది. కానీ సంక్షేమం నీడలోనే భారాల మంటపుడుతోంది. సంక్షేమంలోనూ జిల్లాలో రేషన్‌కార్డులు, పింఛను నుంచి అమ్మఒడి వరకు కోతలు పెరుగుతున్నాయి. ఈ సంక్షేమం జపంతోనే ఎన్నికల్లో గెలవలేమని ఆ పార్టీ సీనియర్లు ఎమ్మెల్యేలతో పాటు జిల్లాకు చెందిన ఒక మంత్రి తన అత్యంత సన్నిహిత అనుయాయులతో చెప్పినట్లు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు ఇవ్వలేని పరిస్థితి. హామీలు, హక్కులు అమలు చేయని పరిస్థితిలో ముఖ్యంగా పట్టణ ఓటర్లపై తీవ్ర ప్రచారం ఉంటుందని మంత్రులు, ఎమ్మెల్యేలు ఇష్టాగోష్టి సమావేశాల్లో మాట్లాడుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ మాటలు అతిశయోక్తి కాదు. ఆ పార్టీ నేతలు బహిరంగంగా చెప్తున్న మాటలివి. చెత్త పన్నులు వసూళ్లు ఆపాలని ఇద్దరు ఎమ్మెల్యేలు అధికారులకు చెప్తున్నట్లు వార్తలొచ్చాయి. ఆ విషయాన్ని ముఖ్యమంత్రి ముందు ఎందుకు చెప్పలేదంటే వారి వద్ద సమాధానం లేదు. తాజాగా నెల్లూరు జిల్లాకు చెందిన వైసిపి ఎమ్మెల్యే ఆనం రాంనారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలు అధినేతకు కంపరం పుట్టించినట్లున్నాయి. నాలుగేళ్లలో ఏం చేశామని ఓట్లు అడగాలని ఆయన పరోక్షంగా అధినేతను ప్రశ్నించారు. జిల్లాలోనూ నేతల్లో అదే పరిస్థితి నెలకొంది. జిల్లాలో ఈ మూడున్నరేళ్లలో ఒక్క ఇళ్లు అందించలేని దయనీయ పాలనలోకి నెట్టబడింది. గత ప్రభుత్వంలో ఆగిపోయిన అభివృద్ధి పనులు, ప్రాజెక్టులను 98శాతం నిలిపివేయడమైంది. మరోకవైపు 98శాతం హామీలు అమలు చేశామని ఊరూవాడా అతిశయొక్తులను ప్రచారం చేసే పరిస్థితిని చూస్తున్నాం. జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలకు మాటల గలగలలు తప్ప, నిధులు గలగల కాగడాపెట్టి వెతికినా కనపించడం లేదు. జిల్లాకు సంబంధించి పనులకు రూ.మూడు వేల కోట్లకు పైగా బిల్లులు బకాయి ఉండటంతో ఎక్కిడి పనులు అక్కడే నిలిచిపోయాయి. మరోవైపు కార్పొరేట్, మతతత్వ విధానాలతో మురుకు సాగుతున్న మోడీ ప్రభుత్వంతో చేతులు కలిపి విద్యా సంస్కరణలు, విద్యుత్ సంస్కరణలను రాష్ట్ర ప్రజలపై ఏకపక్షంగా రుద్దడంతో వైసిపి అధినేత ప్రజలతో లేరని చెప్పకనే చెప్పినట్లు ఉందని జిల్లాలో అత్యధిక మెజారిటీగా ఉన్న లౌకికశక్తులు గట్టిగా విశ్వసిస్తున్నాయి. ఇలాంటి విశ్వాసం ఆ పార్టీ నేతల్లోనూ, కార్యకర్తల్లోనూ స్పష్టంగా కనిపిస్తున్నాయి. అధినేత పాలనపై జిల్లా ఎమ్మెల్యేలు, మంత్రులు కూడా సంతృప్తిగా లేరని తెలిసింది. కార్యకర్తల విషయమైనా చెప్పనక్కర్లేదు. గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమం ఏకరూపుతో ప్రజలు తృప్తిపడటం లేదని, వాళ్లేస్తున్న ప్రశ్నలకు చేపట్టాల్సిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోతున్నామని కార్యకర్తలే కాదు, మాకూ ఎలాంటి గుర్తింపు లేకుండా పోయిందని జిల్లాలోని కొందరు శాసనసభ్యులు, సీనియరు నేతలు నిరాశ, నిస్పృహతో మాట్లాడటం చూస్తున్నాం. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులెవరూ సంతృప్తిగా లేరని, ప్రభుత్వ నిధులు స్వాహా చేయడం జీర్ణించుకోలేకపోతున్నామని ఎమ్మెల్యేలు చెప్తున్నారు. అందువల్ల 175 వైనాట్ నినాదం అంత తేలిక కాదని, ఆ నినాదమే ప్రజాస్వామ్య విరుద్ధమన్న నేతలున్నారు. నియంతృత్వపాలనను ప్రజలు చూస్తున్నారని, జిల్లాలో అన్ని నియోజకవర్గంలోనూ గ్రూపులగోల రోజురోజుకూ పెరుగుతోంది. కాంగ్రెస్ సంస్కృతిలోంచి పుట్టిన పార్టీ కనుక స్వపక్షమే తమ అభ్యర్థులను ఓడించే పరిస్థితి జిల్లాలో ఇప్పటికి నాలుగు నియోజకవర్గాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఆ అవకాశం ప్రజలకిచ్చే పరిస్థితి జిల్లాలో నెలకొంది.



ప్రధాన ప్రతిపక్షం నేతల ప్రసంగాల్లో దూకుడు పెరిగింది తప్ప, ప్రజలను చైతన్య పరచడంలోనూ, సమస్యలపై కదిలించడంలోనూ నేటికీ వెనుకబాటే ఉంది. నిన్నటి బాదుడే బాదుడు కార్యక్రమంలోనూ, నేడు ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అన్న కార్యక్రమంలోనూ నేతలు, కార్యకర్తలతో కార్యక్రమాలు తప్ప, ప్రజలను సమీకరించే పని పెట్టుకోలేదు. ప్రజలను సమీకరిస్తే డబ్బులు ఖర్చవుతాయన్న ధోరణితో నేతలు, కార్యకర్తలకు ముందస్తు ఖర్చు పెట్టడానికి జిల్లాలో సిద్ధంకావడం లేదని తెలిసింది. వైసిపి నేతలపై పెరుగుతున్న ఓటు బ్యాంకు తమ ఖాతాలోకి యథాతథంగా వచ్చి పడతాయన్న భ్రమల్లో జిల్లాలోనూ కొందరు నేతలున్నట్లు వారి మాటలనుబట్టి తెలుస్తోంది. నియంతృత్వ పాలనలో దొందూ దొందే అన్నది ప్రజలకు అనుభవమైంది. గత ప్రభుత్వ పాలనలోనూ ఐదేళ్ల సెక్షన్ 30 జిల్లాలోనూ అమలైంది. అధికారంలోకి వస్తే మెరుగైన సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని ప్రసంగాల్లో అధినేత చెప్తున్నా అవి ఏమిటో నేతలకు అర్థం కావడం లేదు. ప్రజలకు పథకాల పేరిట డబ్బులు పంచే కార్యక్రమానికి జిల్లాలోని కొందరు టిడిపి నేతలు వ్యతిరేకిస్తున్నారు. స్వీస్తుతి, పరనింద ప్రసంగాలు సహజం కానీ, స్వీస్తుతి ప్రసంగాలు అదినేతల్లో కనిపించడం, వినిపించడం లేదు. అధినేత ప్రసంగాలతో మళ్లీ అధికారంలోకి వస్తామన్న నేతల్లో ఆయా నియోజకవర్గాల్లో గ్రూపులగోల వెన్నంటే ఉంది. జిల్లాలోని మూడు నియోజకవర్గాలు తప్ప, ఐదు నియోజకవర్గాల్లో గ్రూపులగోల రోజురోజుకూ బలపడుతోంది. మిగిలిన మూడింటిలోనూ గ్రూపులను తెరతీయడానికి విశ్వప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది.

గత పాలనలో ప్రజల్లో 70శాతం సంతృప్తి ఉందని సర్వే నివేదికల్లో నిర్ధారించుకొని ఎన్నికలకు వెళ్లిన పార్టీని 23 సీట్లతో ప్రజలు ఘోరంగా ఓడించారు. ఎందుకు ఓడిపోయానో నాకే అర్థం కావడం లేదని. ఆ నాడు చంద్రబాబు ప్రకటించారు. చంద్రబాబు ప్రచార తీరు, రాజకీయ విధానం చూస్తుంటే నేటికీ అదే సంసయంలో ఉన్నట్లు కనిపిస్తోంది. పాత పద్ధతిలోనే మా నేత కార్యక్రమాలున్నాయని, రాజకీయ నిర్ణయాల్లో మార్పు రాకుంటే అధికారంలోకి రావడం అంత తేలిక కాదని జిల్లాలోని ఆ పార్టీ సీనియర్లే చెప్తున్నారు. కమలంపై మా వైఖరి ఏమిటో తెలియడం లేదని చంద్రబాబు మౌనంగా ఉండటంతో ప్రజలకు మేం ఏం చెప్పాలో తెలియడం లేదని ఓ సీనియరు నేత చెప్పడం విశేషం. రెండు ప్రధాన పార్టీల్లో గ్రూపులగోల ఉన్న నేపథ్యంలోనూ రెండింటి నుంచి గోడ దూకడాలు ఉంటాయని, పొత్తులు, ఎత్తులు ఎన్నికల సమయం దగ్గరపడే కొద్దీ పరిణామాలు వేగంగా మారుతుంటాయని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

\- సత్తారు భాస్కరరావు

సాంకేతికతను దుర్వినియోగం చేయొద్దు

ప్రజాశక్తి - సీతంపేట

సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేయొద్దని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. యువత అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కేవలం జ్ఞాన సముపార్జన కోసమే ఉపయోగించాలని, కష్టపడి చదివి మంచి ఉద్యోగాలు సంపాధించాలని కోరారు. సీతంపేట ఐటిడిఎలో న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ సెల్‌ఫోన్‌ను జ్ఞానం పెంచుకోవడానికి వినియోగించాలని, దాన్ని దుర్వినియోగం చేయొద్దని అన్నారు. గంటల తరబడి విద్యుత్‌బిల్లు కట్టేందుకు నిలబడే కంటే సెల్‌ఫోన్‌లో బిల్లు చెల్లించడం ఉత్తమం అని అన్నారు. ప్రజలపై మంచి కంటే చెడు ప్రభావం అధికంగా ఉంటుందని, చెడు విషయాలు అత్యంత ప్రభావితం చేస్తాయని, కానీ మనిషి స్వీయ నిర్దేశిత క్రమశిక్షణ అలవర్చుకొని మంచిని మాత్రమే స్వీకరించాలని కోరారు. యువత చెడు ప్రభావాలకు లొంగకుండా కేవలం చదువుపైనే దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని ఆ లక్ష్యం సాధించే దిశగా అహర్నిశలూ శ్రమించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, తద్వారా ఆర్థిక స్వావలంబన కలిగి తమ ఊరికి మంచి పేరు తేవాలని కోరారు. సమావేశంలో జిల్లా న్యాయసేవ అధికార సంస్థ అధ్యక్షులు ఆర్.సన్యాసినాయుడు, పాలకొండ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ విజయ రాజ్‌కుమార్, ఐటిడిఎ పీడీ బి.నవ్య, పాలకొండ డిఎస్‌పి కెవి.కృష్ణారావు, కె.విజయభారతి పాల్గొన్నారు.


యువశక్తి సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాదెండ్ల మనోహర్

'యువశక్తి' సభ ఏర్పాట్లు పరిశీలన

లావేరు: తాళవలసలో ఈ నెల 12న నిర్వహించే యువశక్తి బహిరంగ సభ ఏర్పాట్లను జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ శనివారం పరిశీలించారు. యువశక్తి సభా ప్రాంగణంను ఆయన పరిశీలించారు. స్థానిక జనసేన నాయకులతో రూటు మ్యాప్‌ను పరిశీలించారు. పలు సూచనలను ఆయన నిర్వాహకులకు చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి యువతకు ఏ గ్రామంలోనైనా ఉపాధి కల్పించారా? అని ప్రశ్నించారు. యువశక్తి పేరిట న్యాయ విభాగంలో 32 మంది న్యాయవాదులను ఇప్పటికే నియమించామని, అవసరమైతే న్యాయవాదులను నియమిస్తామని చెప్పారు. సభ ఏర్పాటుకు పోలీసు అధికారులు అనుమతి ఇచ్చారని మీడియా ముందు ఆ కాపీని చూపించారు. సంక్షేమం పేరిట అర్హులైన మత్స్యకారులకు వంద శాతం న్యాయం చేశారా? అని నాదెండ్ల ప్రశ్నించారు. అనంతరం నాదెండ్ల సమక్షంలో రణస్థలం మండలం కొవ్వాడ, పైడిభీమవరానికి చెందిన 50 మంది జనసేన పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా వేసి, పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో విశ్వక్‌షేన్, పేడాడ రామ్మోహన్‌రావు, జి.చైతన్య, దాసరి రాజు, కె.సర్వేశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు.

రూ.10 లక్షలు విరాళం

యువశక్తి బహిరంగసభ నిర్వహణకు ఎచ్చెర్ల నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు సయ్యద్ కాంతిశ్రీ రూ.10 లక్షల చెక్కును నాదెండ్లకు అందించారు. ఆమెతోపాటు డాక్టర్ విశ్వక్‌షేన్ ఉన్నారు.

10న జెడ్‌పి బడ్జెట్ సమావేశాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లా ప్రజా పరిషత్ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 10న నిర్వహిస్తున్నట్లు జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకటరామన్ తెలిపారు. పదో తేదీ ఉదయం 11.30గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



పరుగు పందెంకు సిద్ధంగా ఉన్న వికలాంగులు

పారా అథ్లెటిక్స్‌కు జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి - పలాస

పలాస ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా జట్టు ఎంపికలు శనివారం ఆహ్లాదకరంగా సాగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.తులసీరావు, వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి.తవిటయ్య మాట్లాడారు. క్రీడాకారులు సంకల్పంతో పాల్గొనడం వల్ల క్రీడల్లో రాణించవచ్చని, అంగవైకల్యం క్రీడలకు అడ్డు రాదని అన్నారు. స్టీఫెన్ హాకింగ్ పారా స్పోర్ట్స్ సంఘం ఆధ్వర్యాన ఈ ఎంపికల ప్రక్రియ నిర్వహించామని తెలిపారు. అథ్లెటిక్ శిక్షకుడు కొణతల రామారావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ ఎల్.శ్రీనివాసరావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీడీ పి.మధు, జిల్లా పారా స్పోర్ట్స్ సంఘం అధ్యక్షులు టి.రాము, ప్రతినిధి రాంబాబు, పారా అథ్లెటిక్స్ జాతీయ పతక గ్రహీత ఎన్.రమణయ్య, ఉపాధ్యాయులు టి.చిట్టిబాబు. కె.మాధవరావు పాల్గొన్నారు. ముందుగా సబ్ జూనియర్ జూనియర్, సీనియర్ విభాగాల్లో ఎంపికైన క్రీడాకారులకు పతకాలు అందించారు.



సూర శ్రీనుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విద్యార్థిని

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు అధినేత సూర శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని పాలిటెక్నిక్ కళాశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో విద్యతో పాటు క్రీడలు ఎంత అవసరమన్నారు. శారీరక దారుఢ్యంతో మానసిక ఉల్లాసం కలుగుతుందని చెప్పారు. శ్రీకాకుళం నుంచి కరణం మల్లేశ్వరి, కాశీం ఖాన్ వంటి క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణించారని వివరించారు. డిఆర్‌డిఎ పీడీ డి.వి.విద్యాసాగర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలపై ఆసక్తి కనబరచాలన్నారు. క్రీడల్లో ఉన్నతంగా రాణిస్తే ఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయన్నారు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా క్రీడాకారుడికి గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పది పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 441 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. 13 క్రీడ అంశాల్లో క్రీడాకారులు పోటీపడి విజయం సాధించారు. విజేతలకు మెడల్స్, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.దామోదరరావు, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ ఖోఖోకు గౌరీనాయక్ ఎంపిక

ఇచ్ఛాపురం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని గౌరీనాయక్ సౌత్ జోన్ ఖోఖో టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రోబిన్ కుమార్ పాడి అధ్యక్షతన శనివారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల ఎచ్చెర్లలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో విశ్వవిద్యాలయ స్థాయి ఖోఖో టోర్నమెంట్‌లో అద్భుతమైన ప్రతిభ కనబరిచారని అన్నారు. త్వరలో తమిళనాడులోని బెంగబోనులో నిర్వహించనున్న సౌత్ జోన్ టోర్నమెంట్‌కు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పి.రామకృష్ణ, డాక్టర్ నిత్యానంద పట్నాయక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి - పొందూరు

అర్హతే కొలమానికంగా తీసుకుని సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఆవరణంలో వైఎస్ఆర్ పింఛను కానుకలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 3,17,901 మందికి రూ.86.11 కోట్లు పింఛను రూపంలో అందుతున్నట్లు పేర్కొన్నారు. మండలంలో నూతనంగా 369 మంది అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేశామన్నారు. పార్టీ పరిశీలకులు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు సమన్వయంతో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కిల్లి ఉషారాణి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైసిపి రాష్ట్ర యువజన



పొందూరు : పింఛను కార్డులను అందజేస్తున్న స్పీకర్ సీతారాం

విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, వైసిపి మండల అధ్యక్షులు పప్పల రమేష్‌కుమార్ టౌన్ పార్టీ అధ్యక్షులు గాడు నాగరాజు, కిల్లాన సూర్యారావు, గుడ్ల మోహనరావు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : టెక్కలి మేజర్ పంచాయతీ 188 కొత్త పింఛన్లను ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసు పంపిణీ చేశారు. ముందుగా సిఎం జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపిపి అట్లా జరోజనమ్మ, సర్పంచ్ గొండెలి సుజాత, ఎంపిటిసి పీత హేమలత, వార్డు సభ్యులు పాల్గొన్నారు

పలాస : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ బల్ల గిరిబాబు 207 మందికి నూతన పింఛన్లను అందేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మీసాల సురేష్ బాబు, ఇన్‌ఛార్జి కమిషనర్ అప్పలస్వామి, శార్వాణి రమేష్, శిష్టి గోపి, బల్లయ్య పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మేజర్ పంచాయతీ కార్యాలయంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు బోయిన నాగేశ్వరావు, సర్పంచ్ కాళ్ల సంజీవరావులు నూతన పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి రఘుపాత్రుని యోగేశ్వరరావు, ఉప సర్పంచ్ అనపాన బాలకృష్ణ, పట్టణ అధ్యక్షులు డబ్బీరు ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలే మార్గదర్శకులు

ప్రజాశక్తి - రణస్థలం:

సావిత్రిబాయి పూలే నేటి మహిళలకు దిక్సూచి, ఆదర్శనీయులని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వరరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల శాఖ ఆధ్వర్యాన మండల కేంద్రంలో స్త్రీనిధి భవనంలో సావిత్రిబాయ్ పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాడు స్త్రీ విద్యను ప్రోత్సహించడానికి ఆమె సొంతంగా ఎన్నో పాఠశాలలు స్థాపించి బాలికల విద్యకు ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి టొంపల సీతారాం, ఎంపిడిఒ ధనుంజయరావు, ఎంఇఒ త్రినాథరావు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ కుమార్, జిల్లా సహాయ అధ్యక్షులు ధనలక్ష్మి, కౌన్సిల్ రాష్ట్ర సభ్యులు గిరిధర్, ఎస్.నారాయణరావు పాల్గొన్నారు.



పోలాకి : సన్మానిస్తున్న శ్రీరామ్మూర్తి

పోలాకి : మహిళల విద్య కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప విద్యావేత్త సావిత్రి బాయ్ పూలే అని ఆమె జీవితం మనకు మార్గదర్శనమని యుటిఎఫ్ జిల్లా కోశాధికారి బమ్మిడి శ్రీరామ్మూర్తి అన్నారు. నరసన్నపేట మండలం నడగాం ప్రాథమికోన్నత పాఠశాలలో మండల స్థాయి మహిళా ఉపాధ్యాయ దినోత్సవ సమావేశం శనివారం నిర్వహించారు. అనంతరం దమయంతి, జి.రాజేశ్వరి, ఎం.మాధురి, పి.రమాదేవి, ఎం.కాత్యాయని, కె.కామేశ్వరిలకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రాజాపు దమయంతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్.వెంకటరమణ, యుటిఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు ఎఆర్ఆర్ భూషణ్‌రావు, ప్రధాన కార్యదర్శి కె.ఆదినారాయణ, పి.గోపాలకృష్ణ, ఎపిటిఎఫ్ అధ్యక్షుడు పీస నరసింహమూర్తి పాల్గొన్నారు.



రణస్థలం : మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

సిక్కోలు బెల్లం స్టాల్‌కి విదేశీ సందర్శకులు



బెల్లం స్టాల్‌ను పరిశీలిస్తున్న విదేశీయులు

ప్రజాశక్తి - ఆమదాలవలస

విజయవాడలో రైతు సాధికార సంస్థ, రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ విభాగం నిర్వహిస్తున్న ఆర్గానిక్ మేళా శనివారం రెండో రోజు నిర్వహించారని ప్రకృతి వ్యవసాయ మేనేజర్ రేవతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని నిమ్మ తొర్లాడ, చేపేనపేట గ్రామాల నుంచి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో తయారు చేసిన బెల్లాన్ని ప్రదర్శనలో పెట్టారని అన్నారు. అధిక సంఖ్యలో సందర్శకులు వచ్చి సహజ సేద్య పద్ధతిలో తయారు చేసిన బెల్లాన్ని కొనుగోలు చేశారని తెలిపారు. అలాగే వివిధ దేశాల నుంచి వచ్చిన ఔత్సాహిక సందర్శకులూ బెల్లం స్టాల్‌ని పరిశీలించి బెల్లాన్ని కొనుగోలు చేశారని చెప్పారు. జిల్లా బెల్లానికి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఆదరణ ఉందన్నారు. మన దగ్గర దొరికే నాణ్యమైన, సహజ సేద్య పద్ధతుల్లో బెల్లం లభిస్తుందన్నారు.

తాగునీటిని ఇప్పించరూ...

ప్రజాశక్తి - బూర్జ

మండలంలోని బూర్జ పంచాయతీ చినకురింపేటలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు తాగునీటి సమస్య తీవ్రంగా వేధిస్తోందని, ఇంటింటా కుళాయిలు వేసి మా దాహం తీర్చాలని గ్రామస్తులు కోరారు. మురుగునీరు, వర్షపు నీరు పోయేందుకు కాలువలు ఏర్పాటు చేయాలని విన్నవించారు. స్పీకర్ స్పందిస్తూ... త్వరలో ఇంటింటా కుళాయిలు ఏర్పాటు చేశామని హామీనిచ్చారు. కాలువల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయిస్తానని అన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి జగనన్న పథకాలు అందుతున్నాయా? లేవా? అని అడిగి తెలుసుకున్నారు.



సమస్యలను వివరిస్తున్న గ్రామస్తులు

కార్యక్రమంలో జెడ్‌పిటిసి బెజ్జిపురం రామారావు, అవుట్ సోర్సింగ్ రాష్ట్ర డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, మామిడివలస ఎంపిటిసి గుమ్మడి రాంబాబు, డిసిఎంఎస్ మెంబరు జల్లు బలరాంనాయుడు, సర్పంచ్ వేగు అనురాధ, తహశీల్దార్ రమణారావు, ఎంపిడిఒ రవీంద్రబాబు, హౌసింగ్ ఎఇ ఎం.వి.రమణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాంప్రసాద్, ఎపిఒ రాజ్‌కుమార్, ఎఒ రాజేశ్వరరావు పాల్గొన్నారు.



దామోదరరావు మృతదేహం

ట్రాక్టర్ బోల్తా : వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సోంపేట

మండలంలోని బేసి రామచంద్రాపురం వద్ద శనివారం ట్రాక్టర్ బోల్తా పడిన ప్రమాదంలో మాజీ ఉప సర్పంచ్ వాసెట్టి దామోదరరావు (52) మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు... దామోదరరావు తన సొంత ట్రాక్టర్‌పై డ్రైవర్ సహాయంతో పొలానికి వెళ్తున్నాడు. గ్రామంలోని సచివాలయ సమీపంలో ట్రాక్టర్ అకస్మాత్తుగా బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ పైనుంచి కిందకు పడిపోవడంతో దామోదర్ తలకి తీవ్ర గాయమైంది. వెంటనే సర్పంచ్ ప్రతినిధి బుద్దాన శ్రీకృష్ణ, గ్రామస్తులు దామోదరరావును సోంపేట ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. విషయం తెలుసుకున్న ఎంపిపి డాక్టర్ నిమ్మన దాసు, జెడ్‌పిటిసి ప్రతినిధి తడక జోగారావు, వైసిపి నాయకులు గ్రామానికి చేరుకొని తమ సంతాపం తెలియచేశారు. మృతుడికి భార్య వాసెట్టి సుజాత ప్రస్తుతం ఎంపిటిసిగా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. ఇద్దరికీ వివాహమై బయట ప్రాంతంలో ఉన్నారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకుంది.

వృద్ధుడు ఆత్మహత్య

కొత్తూరు : మండలంలోని ఆకులటంపరకు చెందిన చక్క త్రినాథరావు (63) కడుపునొప్పి తాళ్లలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు... త్రినాథరావు కొన్నేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. వైద్యులను సంప్రదించినా నయం కాకపోవడంతో శుక్రవారం ఇంట్లో ఫ్యాన్ కొక్కానికి తాడు వేసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం ఉదయం కుటుంబ సభ్యులు చూసి వెంటనే దహన సంస్కారలు నిర్వహించారు. మృతుడుకు మద్యానికి అలవాటు పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు సోమరాజుపురం విఆర్ఒ గొటివాడ శ్రీను పోలీలకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ ఎం.గోవిందు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కొత్తూరు : మండలంలోని కాశీపురం నుంచి హడ్డుబంగి వరకు వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మాతల బ్రిడ్జి వద్ద విజిలెన్స్ అధికారులు శనివారం పట్టుకున్నారని సిఎస్‌డిటి రవికుమార్ తెలిపారు. వ్యాన్‌లో 55 బేగుల్లో 27.50 కింటాళ్ళ బియ్యం పట్టుకుని సీజ్ చేశామన్నారు. దీని విలువ రూ.1.45 లక్షలు ఉంటుందని అంచనా వేశామన్నారు. వ్యాన్ డ్రైవర్ ఎల్.లక్ష్మీనారాయణపై కేసు నమోదు చేశామని తెలిపారు.

10 నుంచి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - కవిటి

మండలంలోని బొరివంకలో ఈ నెల పది నుంచి మూడు రోజుల పాటు ఉత్కలాంధ్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్దానం యూత్‌క్లబ్ 10వ వార్షికోత్సవంతో పాటు యువజనోత్సవాల్లో భాగంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి రూ.11,111, ద్వితీయ బహుమతి రూ.8,888, తృతీయ బహుమతి రూ.6,666, చతుర్ధి బహుమతిగా రూ.4,444 నగదుతో పాటు షీల్డ్, ప్రశంసపత్రాలు అందజేస్తున్నామని తెలిపారు.

9 వరకు పింఛన్ల పంపిణీ

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో పంపిణీ అవుతున్న వైఎస్ఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ఈ నెల 9 వరకు కొనసాగుతుందని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు డాక్టర్ డి.వి.విద్యాసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు అందుకోని పింఛనుదారులందరికీ 9 లోగా పింఛన్లు అందుతాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. పంపిణీ విషయమై సంబంధిత అధికారులందరికీ సమాచారం అందజేయాలని స్పష్టం చేశారు.



కార్డులను అందజేస్తున్న సర్పంచ్ ఈశ్వరరావు

రేషన్ కార్డుల పంపిణీ

వజ్రపుకొత్తూరు : పంచాయతీ పరిధిలో సాంకేతిక కారణలతో రేషన్ కార్డులు నిలిచిపోయాయని గడప గడపకు కార్యక్రమంలో మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు విన్నవించారని, దీంతో మంత్రి స్పందించి కార్డుల పంపిణీకి చర్యలు తీసుకున్నారని గరుడభద్ర సర్పంచ్ ప్రతినిధి గూడ ఈశ్వరరావు అన్నారు. ఈ మేరకు శనివారం లబ్ధిదారులకు బియ్యం కార్డులను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో విఆర్ఒ గీతాంజలి, మోహన్, కళ్యాణి, స్వాతి, శ్రీకర్, అవినాష్, నగేష్, అప్పారావు, శ్రీను, మీనాక్షి, శాంతమ్మ, ఈశ్వరరావు, సాయమ్మ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

సరుబుజ్జిలి : సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. మండలంలోని పెద్దపాలెంలో ఉపాధి హామీ కూలీలకు ఆర్‌బిఐ పథకంలో యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్-ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో శనివారం ఆర్థిక అక్షరాస్యత అవగాహన కల్పించారు. డిజిటల్ పేమెంట్లు, వాటివల్ల కలిగే లాభాలను ప్రజలకు వివరించారు. రూపే, ఎటిఎం కార్డు వల్ల కలిగే ప్రయోజనాలను తెలిపారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930, ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మెన్ 14448 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ రాజారావు, వాలంటీర్ మురళి, రామారావు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వెంకటేష్

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న ప్రొక్లెయినర్

బూర్జ: మండలంలోని గుత్తావల్లిలో 60 ఏళ్ల గ్రామ కంఠంలో నివాసం ఉంటున్న గుడిసెలను తహశీలార్ ఎస్.రమణారావు పోలీసుల బలగాలతో శనివారం ప్రొక్లెయినర్‌తో తొలగించారు. గుత్తపల్లికి చెందిన సనపల సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ గుడిసెలను తొలగించినట్లు తహశీల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాగవల్లి నదీ తీరం, రోడ్డు పక్కన 22 మంది కుటుంబాలు కొన్నేళ్లుగా గుడిసెలను వేసుకొని శాశ్వత నివాసం ఏర్పర్చుకున్నారు. ఇందులో రెండు కుటుంబాల వారు కోర్టును ఆశ్రయించడంతో మిగతా 20 ఇళు పూర్తిగా తొలగించారు. దీంతో అక్కడ నివాసం ఉంటున్న కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

గూడు పోయింది



నిరుపేద కుటుంబానికి చెందిన మేమంతా 60 ఏళ్లుగా ఇక్కడే నివాసం ఉంటున్నాం. మేము ఈ స్థలాన్ని ఆక్రమించుకున్నామని నెపంతో మా ఇల్లును అధికారులు ఆకస్మికంగా మా గుడిసెలను తొలగించారు. సంక్రాంతి పండగ ముందు గూడు లేక చెట్ల కింద నివాసం ఉండాల్సిన పరిస్థితి కల్పించారు. ఈ చలిలో గూడు లేక ఎక్కడ నివాసం ఉండాలి.

- సనపల నీలవేణి, గుత్తావల్లి

రోడ్డున పడ్డా



నాకు భర్త లేరు... పిల్లలు అందుబాటులో లేరు.... ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అధికారులు వచ్చి నా గూడును తొలగించారు. ఆదుకోవాల్సిన అధికారులే నాకు విలువ నీడ లేకుండా చేశారు. నేను ఎక్కడ నివాసం ఉండాలి... ఎలా బతకాలి. సంక్రాంతి ముందు ఇలా తొలగించడం అన్యాయం.

- పైడి సూరీడమ్మ

శ్రీచైతన్య విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

2022 విద్యా సంవత్సరానికి జాతీయస్థాయిలో నిర్వహించిన ఇండియన్ టేలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ (ఐఎన్‌టిఎస్ఒ) పరీక్షా ఫలితాల్లో నగరంలోని చైతన్య స్కూల్ విద్యార్థులు ఎంపికైన సత్తాచారు. శనివారం విడుదలైన ఈ ఫలితాల్లో 554 మంది విద్యార్థులు ప్రథమ స్థాయి పరీక్షల్లో విజయం సాధించి ద్వితీయ స్థాయి పరీక్షకు అర్హత సాధించాని అన్నారు. ఈ మేరకు విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.రాంప్రసాద్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.



ఎంపికైన విద్యార్థులు

'ఆదిత్య'లో మార్కెట్ విస్టా 2కె23



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ఆర్ట్స్ కళాశాల రోడ్డు ఉన్న కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాల మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యాన మార్కెట్ - విస్టా 2కె23 ఈవెంట్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజ్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ కె.వేణుగోపాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మేనేజ్‌మెంట్ రంగంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని, ప్రతిఒక్కరూ ఉపాధి పొందడానికి ఆలోచన చేయాలని అన్నారు. ప్రిన్సిపాల్ ఎన్.వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు అత్యున్నత అవకాశాలను అందిస్తున్నామని అన్నారు. విద్యార్థులు డిజిటల్ మార్కెటింగ్ రంగంలో నైపుణ్యాన్ని పెంచుకొని రాణించాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ విభాగాధిపతి జె.ప్రభాకరరావు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు మార్కెటింగ్ రంగాల్లో వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

సర్పంచ్‌లకు రూ.15 వేలు వేతనం ఇవ్వాలి

సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్



మాట్లాడుతున్న గొండు శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం దారిమళ్లించిన రూ.8660 కోట్ల గ్రామ పంచాయతీల నిధులు వెంటనే తిరిగి చెల్లించాలని సర్పంచ్ సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ డిమాండ్ చేశారు. నగరంలోని విశాఖ-ఎ కాలనీలో ఉన్న ఆయన కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. సందర్భంగా మాట్లాడుతూ సర్పంచ్‌లు, ఎంఎ టీసీలకు రూ.15 వేలు గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. సర్పంచ్ గ్రామ పంచాయతీల విద్యుత్ బిల్లులు కట్టవద్దని, పాత పద్ధతిలో రాష్ట్ర ప్రభుత్వమే బిల్లులను చెల్లించాలని కోరారు. 73, 74వ రాజ్యాంగ సవరణ చట్టాల ద్వారా సర్పంచ్‌లకు రాజ్యాంగ బద్ధంగా, చట్ట బద్ధంగా న్యాయ బద్ధంగా ప్రభుత్వం సర్పంచ్‌లకు ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకపోవడం దారుణమన్నారు. సొంత అవసరాలకు నిధులను దారి మళ్లించడంతో గ్రామాలాభివృద్ధి ప్రశ్నార్థకంగా మారుతోందన్నారు. సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల జనవరి 23న అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఈయనతో పాటు సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పిన్నింటి వెంకట భానోజీనాయుడు, సర్పంచ్‌ల సంఘ అధికార రాష్ట్ర ప్రతినిధి రౌతు శ్రీనివాసరావు ఉన్నారు.

మౌలిక సదుపాయాలు లేకుండా ఇళ్లు ఎలా కట్టేది?

మున్సిపల్ చైర్‌పర్సన్ ముందు వాపోయిన లబ్ధిదారులు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

పట్టణంలోని బాహుదా నది ఒడ్డున కేటాయించిన జగనన్న ఇళ్ల కాలనీలో పలువురు లబ్ధిదారులు మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మికి, అధికారులకు ప్రశ్నల వర్షం కురిపించారు. కాలనీ ఇళ్ల స్థలాలు ఇచ్చారు సరే.. ఉండడానికి కనీస సదుపాయాలైన రోడ్డు, డ్రెయినేజీ, విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించలేదని పేర్కొన్నారు. ఇలా అయితే ఇళ్లు పూర్తి చేసేదెప్పుడు అని ప్రశ్నించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆధ్వర్యాన పాతాళ సిద్ధేశ్వర ఆలయం వద్ద కమిషనర్ రమేష్, హౌసింగ్ అధికారులు శనివారం అవగాహన కల్పిస్తుండగా... వారి వద్ద లబ్ధిదారులు వాపోయారు. అనంతరం వారు మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని న్నారు. ఇప్పటికీ ఇళ్లు నిర్మించని వారు ఉంటే ఇళ్ల పట్టాలను తిరిగి తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఇళ్లు కట్టిన వారికి విడతల వారీగా సకాలంలో బిల్లులు మంజూరు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డిఇ రామకృష్ణ, ఎఇ గోవిందరావు, ఎఇ ఎం.వి.ప్రసాద్, జానకిరావు పాల్గొన్నారు.



చైర్‌పర్సన్‌కు సమస్యలను వివరిస్తున్న లబ్ధిదారులు

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి - నందిగాం

మండలంలోని 33/11కెవి సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నామని, ఇందులో భాగంగా ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని నందిగాం, తామరపల్లి, హరిదాసుపురం, నరేంద్రపురం, కణితివూరు, నర్సిపురం గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.



మాట్లాడుతున్న సర్పంచ్ జోగారావు

పలాసపురంలో గ్రామసభ

ప్రజాశక్తి - సోంపేట

పంచాయతీ అభివృద్ధికి గ్రామస్తులు సహకరించాలని పలాసపురం సర్పంచ్ తడక జోగారావు కోరారు. స్థానిక సచివాలయం వద్ద శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలోని అర్హులందరికీ ఉపాధి పనులు కల్పించేందుకు పనులు గుర్తిస్తున్నామన్నారు. అలాగే పంచాయతీలో పలు అభివృద్ధి పనులకు సైతం చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామంలో చెత్త సేకరణ వాహనంలో ప్రజలు చెత్తా చెదారాలను వేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కామేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సచివాలయం సందర్శన



పరిశీలిస్తున్న వెంకటరామన్

కవిటి: మండలంలోని బి.జి.పుట్టుగ సచివాలయాన్ని కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం తనిఖీ చేసినట్టు జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకటరామన్ తెలిపారు. ఇటీవల నరసన్నపేట వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి బి.జి.పుట్టుగ సర్పంచ్ తమ సచివాలయం ప్రారంభించుకునేందుకు అనుమతి ఇవ్వాలని వినతిపత్రం అందించారు. దీంతో సిఎం కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయానికి బి.జి.పుట్టుగ సచివాలయం ప్రారంభోత్సవానికి ఉన్న సమస్యలు తెలుసుకోవాలని ఆదేశించారని అన్నారు. అనంతరం మాట్లాడుతూ ఈ సచివాలయంపై అప్పటికే స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలను ఆక్రమించి నిర్మించారని గతంలో ఫిర్యాదు ఉందన్నారు. ఈ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎస్ఒ వి.ఎస్.ఎన్.మూర్తి, ఇఇ ఎం.ఎస్.కుమార్, డిఒ ఎస్.శ్రీరాములు, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, సర్పంచ్ బద్రి ప్రకాష్, ఎంపిడిఒ పి.సూర్యనారాయణరెడ్డి, జెఇ ప్రవీణ్ కుమార్, ఎంఇఒ ధనుంజయ రెడ్డి పాల్గొన్నారు.

'ఆశ్రా' సేవలు అభినందనీయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వినియోగదారుల పరిరక్షణలో స్వచ్ఛంద సంస్థ ఆశ్రా అందిస్తున్న సేవలు అభినందనీయమని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. ఆశ్రా సంస్థకు వినియోగదారుల హక్కుల పరిరక్షణలో భాగస్వామ్యం చేస్తూ ఎపి పౌర సరఫరాశాఖ కమిషనర్ సిహెచ్.అరుణకుమార్ జారీ చేసిన గుర్తింపు పత్రాన్ని కలెక్టర్ సంస్థ ప్రతినిధులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినియోగదారుల హక్కులకు గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో నిరక్షరాస్యులైన వినియోగదారులు మోసాలకు గురవుతున్నారని, వారికి అవగాహన కల్పించాలని అన్నారు. అలాగే సైబర్ నేరాలపైనా అవగాహనా సదస్సులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆశ్రా ఉపాధ్యక్షులు గేదెల ఇందిరాప్రసాద్, గంజి ఎజ్రా, ఎల్.రవికుమార్, గజపతిరావు, శాసపు జోగినాయుడు, డాక్టర్ జ్యోతి ఫ్రెడరిక్, వారాడ రాజేంద్రనాయుడు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

108 ఉద్యోగులను ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని టెక్కలి నియోజకవర్గ 108 ఉద్యోగులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్సీ కార్యాలయంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం 108 సిబ్బంది మాట్లాడుతూ రాత్రనక, పగలనక నిస్వార్థంగా పేదలకు 17 ఏళ్లుగా సేవలందిస్తున్నామని అన్నారు. ఉద్యోగులను చిన్నచిన్న కారణాలు చూపించి తొలగించడం, వేరే జిల్లాలకు బదిలీ చేయడం బాధకరమన్నారు. దీనిపై ఎమ్మెల్సీ స్పందించి మాట్లాడుతూ సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో దేవాది శ్రీనివాసరావు, జోగి ఆదినారాయణ, శ్రీనివాస్ బెహర, కంచరాన వెంకటరమణ, వాన కుమారస్వామి, బొడ్డేపల్లి రమణ పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న మంగమ్మ

ఆర్‌బికె ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి- కవిటి

కవిటి బజారు వీధిలో ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని ప్రత్యేక అధికారి అలివేలు మంగమ్మ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ మేరకు రికార్డులను పరిశీలించి ధాన్యం కొనుగోలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ట్రక్ షీట్లు తీస్తుంటే నందిగాం, టెక్కలి మిల్లులు చూపిస్తున్నాయని, అంతదూరం వెళ్లేందుకు రైతులు ఆసక్తి చూపించడం లేదని ప్రత్యేక అధికారికి సిబ్బంది తెలిపారు. దీనికి స్పందించిన ప్రత్యేక అధికారి ట్రక్ షీట్ ఎక్కడ చూపిస్తే అక్కడకి వెళ్లాల్సిందేనని, దానికి సంబంధించిన ప్రయాణభత్యాలు రైతు ఖాతాలో జమ అవుతాయని తెలిపారు. అంతేకాకుండా ట్రక్ షీట్ వచ్చిన 21 రోజుల్లో రైతుల ఖాతాలో ధాన్యం డబ్బులు జమ అవుతాయని తెలిపారు. ఈ తనిఖీ లో డిటి టి.రామచంద్రరావు, ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి, సిబ్బంది కళ్యాణ్, సంతోష్ ఉన్నారు.



ట్యాబ్‌లను అందజేస్తున్న ఎంపిపి దాసు

ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని ఇసకలపాలెం ఉన్నత పాఠశాలలో శనివారం ఎంపిపి డాక్టర్ దాసు విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిదేని అన్నారు. పేద విద్యార్థులకు సైతం సాంకేతిక, కంప్యూటర్ పరిజ్ఞానం అందించాలని లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మడ్డు రాజారావు, తిరుపతి, బైపల్లి రామారావు, బి.మంగయ్య, ధర్మారావు, దేవకి, ఢిల్లీశ్వరి, సర్పంచ్ అంకమ్మ, హెచ్ఎం జయలక్ష్మి పాల్గొన్నారు.

రుర్బన్ పనులపై సమీక్ష

స్థానిక పంచాయతీరాజ్ కార్యాలయంలో ఎంపిఇప డాక్టర్ దాస్ ఆధ్వర్యాన రుర్బన్ పనులపై సమీక్షించారు. ఇప్పటివరకు మండలంలో చేపట్టిన పనులపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకటరమణ, పంచాయతీరాజ్ ఎస్ఇ వి.ఎస్.ఎన్.మూర్తి, ఇఇ ఎం.శ్రీనివాస్, డిఇ శ్రీరాములు, ఎఇ కె.రమేష్, ధనుంజయ, జెడ్‌పిటిసి ప్రతినిధి తడక జోగారావు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమం

ప్రజాశక్తి- జి.సిగడాం

పార్టీలకతీతంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తుందని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని జగన్నాథవలస గ్రామ సచివాలయం పరిధిలోని కొత్తపేటలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు అందుతున్న మధ్యాహ్న భోజన పథకం మెనూను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి మీసాల వెంకటరమణ, జెడ్‌పిటిసి కాయల రమణ, వైసిఇప మండల అధ్యక్షులు బూరాడ వెంకటరమణ, జి.సిగడాం పిఎసిఎస్ అధ్యక్షులు ఎర్నేన ప్రకాష్, ఎంపిడిఒ శ్రీనివాసరావు, విద్యుత్‌శాఖ ఎఇ తిరుపతిరావు పాల్గొన్నారు.



జి.సి.గడాం : సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

టెక్కలి రూరల్: ప్రజా సంక్షేమమే ఊపిరిగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి జనరంజక పాలనని అందిస్తున్నారని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. టెక్కలి మేజర్ పంచాయతీ పెద్ద శేరివీధి వీధిలో గడప గడపకు మన ప్రభుత్వం చేపట్టారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి అట్లా జరోజనమ్మ, సర్పంచ్ గొండెలి సుజాత, ఎంపిటిసి పీత హేమలత, చింతాడ గణపతిరావు, మండల పార్టీ అధ్యక్షుడు బగాది హరి పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్ పరిశీలన

ప్రజాశక్తి- ఆమదాలవలస

జగనన్న గృహాలను లబ్ధిదారులు సత్వరమే నిర్మించాలని ఎంపిడిఒ ఎం.రేణుక అన్నారు. మండలంలోని సంతకొత్తవలస పంచాయతీలోని జగనన్న కాలనీ లేఅవుట్‌ను శనివారం పరిశీలించారు. ఈ మేరకు లబ్ధిదారులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళు నిర్మించని లబ్ధిదారులు వెంటనే పనులను ప్రారంభించాలని, లేకుంటే పట్టాలు రద్దయ్యే అవకాశం ఉన్నదని అన్నారు. గృహ నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులకు ప్రభుత్వం వెంటనే బిల్లులను మంజూరు చేస్తున్నదని తెలిపారు. లబ్ధిదారులకు సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తానని తెలిపారు. డ్వాక్రా మహిళలకు రూ.35 వేల రుణాన్ని పావలా వడ్డీకే ప్రభుత్వం మంజూరు చేస్తున్నందని, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కొంతమంది లబ్ధిదారులు చిన్నజొన్నవలస నుంచి సంతకొత్తవలస లేఅవుట్ దూరం ఎక్కువగా ఉందని, తమ గ్రామం వద్ద తమకు స్థలాలు కేటాయించాలని ఆమెను కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇళ్లను ఇక్కడ నిర్మించుకుంటే ఇదే మీ ఊరు అవుతుందని అన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ రమేష్, పంచాయతీరాజ్ ఎఒ జ్యోతి, విద్యుత్‌శాఖ ఎఇ రవికుమార్, ఎపిఎం పైడి కూర్మారావు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ చంద్రమౌళి, సర్పంచ్ ప్రతినిధి నవిరి చిన్నారావు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ రేణుక

ఒటిఎస్ పత్రాలు అందజేత

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని బూరగాం పంచాయతీలో ఎంపిపి దేవదాసు రెడ్డి ఒటిఎస్ లబ్ధిదారులకు ధ్రువపత్రాలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒటిఎస్ లబ్ధిదారులకు తమ ఇళ్లపై సంపూర్ణ హక్కు లభిస్తుందన్నారు. మిగిలిన వారు సైతం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వాలంటీర్లు, అధికారులు గ్రామాల్లో ఒటిఎస్ పథకం ప్రయోజనాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షుడు గుమ్మిడి రామదాసు, ఆర్‌బికె అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు లడ్డు కేశవ పాత్రో, నాయకులు వెంకటరావు, డి.ధర్మారావు, అభిరామ్, దూర్వసులు, సంతోష్, ఢిల్లీ, మన్మథరావు పాల్గొన్నారు.

నందిగాం: జగనన్న సంపూర్ణ ఇళ్ల హక్కు పథకంలో భాగంగా లబ్ధిదారులకు ఒటిఎస్ పత్రాలను ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి శనివారం పంపిణీ చేశారు. స్థానిక సచివాలయంలో సర్పంచ్ ప్రతినిధి జడ్యాడ జయరాం, ఎంపిటిసి ప్రతినిధి అంబోడి విష్ణుతో కలిసి వంద మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పత్రాలతో లబ్ధిదారులకు పూర్తి స్థాయి హక్కులు ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి, లబ్ధిదారులు పాల్గొన్నారు.



కంచిలి : ధ్రువపత్రాలను అందజేస్తున్న ఎంపిపి దేవదాస్‌రెడ్డి

ప్రహరీ తొలగింపు బిల్లు చెల్లించాలి

పొందూరు: మండలంలోని ధర్మపురం ప్రాథమిక పాఠశాల ప్రహరీ తొలగింపు పనులు చేసి రెండేళ్లు పూర్తయినా అధికారులు బిల్లు చెల్లించడం లేదని వైసిపి నాయకులు మొదలవలస మురళీకృష్ణ ఆవేదనను వ్యక్తం చేశారు. 2020 డిసెంబరులో ఎం-బుక్ చేశారని, బిల్లు చెల్లించాలని అధికారుల ను అడిగితే ఎం-బుక్ పోయిందని చెబుతున్నారని వాపోయారు. దీనిపై రెండు సార్లు కలెక్టర్ స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసినా ఎటువంటి స్పందన లేదని అన్నారు. ఇటీవల గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్య క్రమంలో పాల్గొన్న స్పీకర్ తమ్మినేని సీతారాం దృష్టికీ తీసుకువెళ్లామని పేర్కొన్నారు. వైసిపి నాయకులమైన మాకే న్యాయం జరగకపోతే ఎలా అని వాపోయారు. జిల్లా అధికారులు స్పందించి ఎం-బుక్ మాయం కావడంపై విచారణ చేపట్ట తనకు వడ్డీతో కలిపి బిల్లు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యార్థులకు అభినందనలు

రణస్థలం రూరల్: మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఇన్‌స్పైయర్ అవార్డులకు మండలంలోని కోష్ట శ్రీనారాయణ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మూడు ప్రాజెక్టులు ఒకే ఏడాదిలో ఎంపికయ్యారని డైరెక్టర్ కెల్ల మంజు భార్గవి శనివారం తెలిపారు. మొదటి ప్రాజెక్టు భద్రాచలం లాస్యమృత వర్షిని 9వ తరగతి, రెండో ప్రాజెక్టు కోనేటి సౌమ్య 9వ తరగతి, మూడో ప్రాజెక్టు సనపల మనోహర్ ఆరో తరగతి ముగ్గురు విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.10 వేలు అందించారని అన్నారు. ఒకే ఏడాదిలో ఇన్‌స్పైయర్‌కు ఎంపికైనందుకు కరస్పాండెంట్ కెల్ల గోవింద, ప్రిన్సిపాల్ గౌరు నాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.



రణస్థలం రూరల్ : మెమోంటోలతో విద్యార్థులు

ఇచ్ఛాపురం : మండలంలోని మందపల్లి తోటవీధిలో ఉన్న శ్రీసత్య సాయి విద్యా సంస్థలకు చెందిన విద్యార్థిని ఎం.సోనియాకి ఇన్‌స్పైయర్ అవార్డు రావడంతో పాఠశాల యాజమాన్యం భానుతేజా, హెచ్ఎం కిరణ్‌కుమార్ ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

నిర్వాసితుల పునరావాసానికి భూసేకరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పోర్టు నిర్వాసిత గ్రామమైన మూలపేట నిర్వాసితులకు పునరావాసానికి కె.నౌపడని భూసేకరణ చేపడుతున్నట్టు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కె.నౌపడ భూములకు ఎకరానికి రూ.26 లక్షల పరిహారం చెల్లించేందుకు నిర్ణయించినట్టు పేర్కొన్నారు. కె.నౌపఢ రైతుల అంగీకరాంతో ఈ పరిహారం చెల్లించేందుకు నిర్ణయించినట్టు చెప్పారు. పునరావాస కాలనీకి 54 ఎకరాలు భూసేకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. అందులో రోడ్డు పక్కన ఉన్న 34 ఎకరాల భూములకు ఎకరానికి రూ.26 లక్షలు చొప్పున పరిహారం చెల్లించేందుకు నిర్ణయించామన్నారు.

'పెన్షన్లు చెల్లించలేని దివాళా ప్రభుత్వం'

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఏడు దశాబ్దాల కాలంలో ఎప్పుడూ ఇలాంటి ప్రభుత్వాన్ని ఉద్యోగులు, పెన్షనర్లు చూసి ఉండరని, వారం రోజులు గడచినా ఉద్యోగులకు జీతాలు, పెన్షన్ చెల్లించలేక ఇబ్బందుల పాల్జేస్తున్న జగన్ ప్రభుత్వం చరిత్రలో నిలిచి పోతుందని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె.బాబు ధ్వజమెత్తారు. నగరంలోని టిడిపి కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. పండగ రోజుల్లోనూ జీతభత్యాలకు ఎదురు చూడాల్సిన దుస్థితి రావడం దురదృష్టకరమన్నారు. గత ప్రభుత్వాలు ప్రతినెలా ఒకటిన జీతాలు చెల్లించేవారని అన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 9 డిఎలు బకాయిలు ఉన్నా చెల్లించడం లేదన్నారు. సమావేశంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శింతు సుధాకర్, ఐటిడిపి జిల్లా అధ్యక్షుడు ప్రధాన విజయరాం పాల్గొన్నారు.



నియామక పత్రాలను అందజేస్తున్న ఎంపిపి శ్రీరామ్మూర్తి

నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి- నందిగాం

మండలంలో నూతనంగా నియమితులైన వాలంటీర్లకు ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి నియామకపత్రాలు అందజేశారు. మండల పరిషత్ కార్యాలయంలో నౌగాం, కల్లాడ, సైలాడ, కాపుతెంబూరు సచివాలయాల పరిధిలోని నూతనంగా నియమితులైన వాలంటీర్లకు శనివారం ఈ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేదలకు అందించేందుకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ హెచ్.వి.రమణమూర్తి, సర్పంచ్ మోహనరావు పాల్గొన్నారు.

13 విద్యుత్ స్తంభాల ఏర్పాటు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని తుడ్డలిలో ఎంపీ ల్యాండ్ నిధులు రూ.1.50 లక్షలతో సిఎస్‌పి రోడ్డు నుంచి గ్రామంలో వరకు 13 విద్యుత్ స్తంభాలను శనివారం ఏర్పాటు చేశారు. ఈ పనులను సర్పంచ్ అంపిలి రూపావతి, ప్రతినిధి గణపతి పరిశీలించారు. ఈ నిధులు సమకూర్చిన ఎంపీ కింజరాపు అచ్చెన్నాయుడుకు, టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్‌కు అభినందనలు తెలిపారు.

ఐక్యతతో సంఘాల అభివృద్ధి



మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మహిళా స్వయంశక్తి సంఘాల సభ్యులు ఐక్యత వల్లే అభివృద్ధి చెందుతాయని వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. పట్టణంలోని మహిళా సమాఖ్యలో సిబ్బందితో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరక్షరాస్యత, అనారోగ్యం, పౌష్టికాహార లోపం, మూఢనమ్మకాలు, సామాజిక వివక్ష తదితర కారణాలతో కుటుంబాల అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. వీటన్నింటినీ అధిగమించడానికి సామాజిక చైతన్యం, బాలికా విద్యను ప్రోత్సహించడం, పారిశుధ్యాన్ని మెరుగుకు మహిళలందరూ ఐక్యతగా ఉండడం వల్లే సాధ్యపడుతుందని వివరించారు. కార్యక్రమంలో మండల సమైక్య ప్రతినిధులు, అకౌంటెంట్ కళ్యాణి క్లస్టర్ కో-ఆర్డినేటర్లు చంద్రావు, రమణ, సుభద్ర, డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్ పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

కళలను, కళాకారును ప్రోత్సహించాలని మండలంలోని తిరుపతిపాలెం మాజీ సర్పంచ్ మండల రామునాయుడు అన్నారు. శుక్రవారం రాత్రి 25 మంది కోలాటం కళాకారులకు శనివారం చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం సంప్రదాయ కళలు గుర్తుంచటం తక్కువగా ఉందని అన్నారు. సంప్రదాయ కళలు గుర్తింపుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

విద్యార్థులకు...

కోటబొమ్మాళి: మండలంలోని దంత సర్పంచ్ గొండు మురళి, చాందినిల కుమార్తె ప్రణతి జ్ఞాపకార్థం పాఠశాలలో చదువుతున్న 120 మంది, దాసరిపేట ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 11 మంది విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గొండు నారాయణరావు, ఉపాధ్యాయులు జగన్మోహన్‌రావు, రమణ, జ్యోతి, చిరంజీవి, చైర్మన్ సింహాచలం పాల్గొన్నారు.



కోటబొమ్మాళి: దుస్తులను అందజేస్తున్న మురళి, చాందిని

జి.సిగడాం : మండలంలోని అద్దానంపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులు జనవరి ఒకటిన తమ స్వసిద్ధంతో తయారు చేసిన గ్రీటింగ్స్‌ను విక్రయించారు. వాటితో వచ్చిన డబ్బులను రాజాంలోని వికలాంగ పాఠశాల విద్యార్థులకు దుప్పట్లు, పళ్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అరుణకుమారి, సీతమ్మ పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న నళినీకాంత్

కెజిబివి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి- జలుమూరు

స్థానిక కెజిబివిని సమగ్ర శిక్షా అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎస్.నళినీకాంత్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కెజిబివి సిబ్బంది, విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? లేదా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో వసతి, మౌలిక సౌకర్యాలపై ఆరా తీశారు. ఈయడాది పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో మంచి ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. ఈయనతో పాటు ఎస్ఒ శారద, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

వివేకానందుని జీవితం ఆదర్శనీయం

ప్రజాశక్తి- పొందూరు

స్వామి వివేకానందుని జీవితం యువతకు ఆదర్శనీయమని పొందూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పసుమర్తి రామ్‌మనోహర్ అన్నారు. జాతీయ యువజన వారోత్సవాల సందర్భంగా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యాన శనివారం కళాశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, వాలంటీర్లు చందన రవీంద్ర, కామర్స్ నాగరాజు పాల్గొన్నారు.



మెమొంటోను అందజేస్తున్న ప్రిన్సిపాల్ రామ్‌మనోహర్

ప్రజాశక్తి
శ్రీకాకుళం



కంబాల చంద్రశేఖర్

ఉద్యోగ విరమణ ప్రత్యేక అనుబంధం

ఆదివారం 8-1-2023 4 పేజీలు




సేవకు చిరునామా చంద్రశేఖర్

పోస్టల్ ఉద్యోగుల సమస్యలపై రాజీ లేని పోరు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కంబాల చంద్రశేఖరరావు... పోస్టల్ శాఖలో పరిచయం అక్కర్లేని పేరు. శ్రీకాకుళం కలెక్టరేట్ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్‌గా చిరునవ్వుతో ప్రజలకు సేవలందించడమే కాదు, ఆపదలో ఉన్న వారికి ఆపన్నహస్తం అందించేవారు. పోస్టల్ ఉద్యోగుల సమస్యలపై రాజీ లేని పోరాటం చేసేవారు. తాత, తండ్రుల ఉద్యమ వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని అనేక ప్రజా ఉద్యమాల్లో భాగస్వామ్యం కావడంతో పాటు ప్రజాతంత్ర ఉద్యమ అభివృద్ధికి బాటలు వేశారు. 42 ఏళ్ల పాటు పోస్టల్ శాఖలో పనిచేసిన ఆయన గతేడాది డిసెంబరు 31న ఉద్యోగ విరమణ చేశారు. ప్రజాశక్తి ప్రత్యేక సంచికకు ఆయన ఉద్యోగ, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు విషయాలను వెల్లడించారు.

స్వాతంత్ర్య పోరాటానికి, వామపక్ష, ప్రజాస్వామ్య ఉద్యమాలకు పేరెన్నిక గల సోంపేట మండలం బారువలో ఆ ఉద్యమాల వారసత్వం కలిగిన కుటుంబంలో కంబాల విశ్వనాథం, లక్ష్మీనరసమ్మకు నాలుగో సంతానంగా 1962 డిసెంబర్ పదో తేదీన చంద్రశేఖర్ జన్మించారు. బారువ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి వరకు చదువుకున్నారు. ఎనిమిది నుంచి పదో తరగతి వరకు గుంటూరు జిల్లా తాడికొండలోని ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ పాఠశాలలో చదివారు. 1978-1980లో సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. ఉద్యోగంలో చేరిన తర్వాత కరస్పాండెన్స్ ద్వారా ఆంధ్రా యూనివర్సిటీలో డిగ్రీ బిఎ పూర్తి చేశారు.



ఉద్యోగ జీవితం

1981 అక్టోబరులో సోంపేటలో పోస్టల్ అసిస్టెంట్‌గా ఆయన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. సోంపేట, బారువ, టెక్కలి, శ్రీకాకుళం, ఆమదాలవలసలో పనిచేశారు. సబ్ పోస్ట్ మాస్టర్‌గా శ్రీకాకుళం న్యూ కాలనీ, శ్రీకాకుళం జిల్లా కోర్టు, కలెక్టర్ కార్యాలయ పోస్టాఫీసుల్లో పనిచేశారు. శ్రీకాకుళం, ఆమదాలవలస హెడ్ పోస్టాఫీసులో అసిస్టెంట్ పోస్టుమాస్టర్‌గా, హెడ్ పోస్టుమాస్టర్‌గా ఆమదాలవలసలో కొద్దికాలం బాధ్యతలు నిర్వర్తించారు.

కుటుంబ నేపథ్యం

చంద్రశేఖర్ తాత ...2లో





సేవకు చిరునామా చంద్రశేఖర్

(మొదటి పేజీ తరువాయి)

నారాయణ స్వామి జాతీయోద్యమానికి సహాయ సహకారాలు అందించారు. తండ్రి విశ్వనాథం ఆ లక్షణాలను పుణికిపుచ్చుకుని వామపక్ష, ప్రజాస్వామ్య ఉద్యమాలకు బాసటగా ఉండేవారు. విశ్వనాథం బారువ హైస్కూల్‌లో జూనియర్ సహాయకులుగా చాలాకాలం పనిచేశారు. భార్య హేమలత (శాంతి) హిందీ పండిట్‌గా కుంచాడలో పనిచేస్తున్నారు. పెద్ద కుమార్తె సరిత బిటెక్ పూర్తి చేసి, బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. అల్లుడు రమేష్ బెంగళూరులోనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేస్తున్నారు. మనవడు చేతన్ ఉన్నాడు. చిన్న కుమార్తె హరిత బిఎస్‌సి కంప్యూటర్స్ చేసి, సాఫ్ట్‌వేర్ రంగంలోనే ఉద్యోగం చేస్తున్నారు.

ఉద్యమ ప్రస్థానం

1981లో ఉద్యోగంలో చేరాక నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ (ఎన్ఎఫ్‌పిఇ) నాయకుడు కామ్రేడ్ కె.ఆదినారాయణ ప్రభావంతో ఉద్యోగుల సమస్యలపై రాజీ లేని పోరాటాలు చేశారు. 1984 సెప్టెంబరులో ఉద్యోగుల ఇడి వేతన సవరణకు చేపట్టిన సమ్మె జయప్రదానికి కాశీబుగ్గ నుంచి ఇచ్ఛాపురం వరకు ప్రచారం నిర్వహించారు. 53 రోజుల పాటు సమ్మెలో పాల్గొని తన నిబద్ధతను నిరూపించుకున్నారు. అదే స్ఫూర్తితో పోస్టల్, టెలికాం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, ప్రజాసంఘాల ఐక్య ఉద్యమాల్లో పాల్గొన్నారు. సోంపేట ప్రాంతంలో వెంకట్రావు పాణిగ్రాహి, జ్యోతీశ్వరరావు తదితరుల సహకారంతో సంఘాలను నిర్మించి బలోపేతం చేశారు. ప్రజాతంత్ర ఉద్యమ అభివృద్ధికి కృషి చేశారు. ఎన్ఎఫ్‌పిఇలో పనిచేయడం ద్వారా తన జీవితం సార్ధకమైందని తెలిపారు. విశ్రాంత జీవితంలోనూ మరిన్ని పోరాటాలు, సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యమవుతానని చెప్పడం తన ఉద్యమ నిరతికి నిదర్శనం.

ప్రణాళికలతో మలి జీవితం ప్రశాంతం

ఉద్యోగ విరమణ చేసే ప్రతి ఉద్యోగీ మలి జీవితం ప్రశాంతంగా గడపాలని కోరుకుంటాడు. అలా ప్రశాంతంగా గడపడానికి కొన్ని ప్రణాళికలు రూపొందించుకోవాలి. ఉద్యోగ విరమణ సమయంలో చేతికి వచ్చే మొత్తాన్ని దుర్వినియోగం చేయకుండా భవిష్యత్ అవసరాల దృష్ట్యా పొదుపు చేయాలి. కొంతమంది నెలసరి వడ్డీకి బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేస్తారు. వీటిపై వచ్చే రాబడి తక్కువైనా భద్రతకు ఢోకా ఉండదు. మొత్తం డబ్బంతా దీర్ఘకాలిక డిపాజిట్లు రూపంలో పెట్టుకోవడం కూడా సరైన నిర్ణయం కాదు. భవిష్యత్తు సమస్యలను తట్టుకోవడానికి ఎప్పుడూ కొంత సొమ్ము అందుబాటులో ఉండాలి. అలాగని ఇంట్లో వేలకు వేలు పెట్టుకుని నిద్ర లేని రాత్రుళ్లు గడపాలని కాదు. ఎప్పుడైనా తీసుకునే వీలుండేలా కొంత మొత్తాన్ని దాచిపెట్టుకోవాలి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం



కనీసం మూడు నుంచి ఆరు నెలల అవసరాలకు సరిపోయే సొమ్ము ఉండాలి. వృద్ధాప్యంలో ఆదాయం ఉండదు కానీ ఖర్చులు పెరుగుతాయి. ఆరోగ్యంగా ఉన్నవారికి ప్రీమియం దండగని ఆరోగ్యబీమా పాలసీని వదులుకోవడం చాలా తప్పు. ఆర్థికంగా కుంగదీసే వైద్యఖర్చులను తట్టుకోవాలంటే ఆరోగ్య బీమాకు మించిన ప్రత్యామ్నాయం లేదు. ఉన్న పాలసీని వదులుకుంటే ఆ తర్వాత కావాలనుకున్నా దక్కకపోవచ్చు. వాస్తవానికి నాలుగైదేళ్లలో ఉద్యోగవిరమణ చేస్తారనగానే ఆరోగ్యబీమా మొత్తాన్ని పెంచుకోవడం మంచిపని. కొత్తగా తీసుకోదలిస్తే మాత్రం వీలైనంత వరకూ బ్యాంకు అందించే సామూహిక ఆరోగ్యబీమా పథకాన్ని ఎంచుకోవడం మేలు. ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటే మలిజీవితం సాఫీగా సాగే అవకాశముంటుంది.

మలిజీవితంలో ఆర్థికపరమైన అవసరాలు ఎక్కువగా ఉంటాయి. పైగా ఉద్యోగంలో ఉన్నప్పుడులా క్రమం తప్పకుండా జీతం కూడా ఉండదు. పింఛను సౌకర్యం ఉన్నవారికి కొద్దిగా వెసులుబాటు ఉంటుంది. పిఎఫ్, గ్రాట్యుటీ, ఇతర ప్రయోజనాల పేరుతో లక్షల రూపాయలు చేతికి వస్తాయి. మలి జీవితం ప్రశాంతంగా సాగేందుకు ఈ సొమ్ము అవసరమవుతుంది. అందుకే పెద్ద మొత్తంలో వచ్చే ఈ డబ్బును జాగ్రత్తగా కాపాడుకోవాలి. అప్పుడే మిగిలిన జీవితాన్ని ఆనందమయంగా గడపడం సాధ్యమవుతుంది.

ఉద్యోగ విరమణ తర్వాత క్రమం తప్పకుండా వచ్చే ఆర్జన ఉండదన్నది అందికీ తెలిసిందే. కాబట్టి ఖర్చుల విషయంలో కొంత రాజీ పడటం తప్పదు. వయసు పెరుగుతున్న కొద్దీ ఆరోగ్య సమస్యలు వస్తుంటాయి. పెరిగిన వైద్య ఖర్చులు తట్టుకోవాలంటే ప్రత్యేకంగా కొంత సొమ్మును వైద్య ఖర్చులకు కేటాయించాల్సిన అవసరం ఉంది. కొన్నిసార్లు అత్యవసర పరిస్థితులూ ఏర్పడవచ్చు. అలాంటప్పుడు ఇబ్బంది రాకుండా చూసుకునేందుకు కొంత మొత్తం బ్యాంకులో నగదు లేదా ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో అందుబాటులో ఉంచుకోవాలి.

ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు ఉద్యోగ విరమణ అనివార్యం. ఉద్యోగంలో చేరే రోజే ఉద్యోగ విరమణ తేదీ తెలిసిపోతోంది. ఉద్యోగమే కాదు.. ఏ వృత్తిలో ఉన్నా, వ్యాపారమైనా కొన్నాళ్లకు రిటైర్‌మెంట్ తప్పదు. రోగాలు ఎన్ని పెరిగినా ఆధునిక వైద్య చికిత్స నేపథ్యంలో ఆయుఙ్ణ ప్రమాణం బాగా పెరిగింది. ఇప్పుడు దాన్ని ప్రభుత్వాలు 60 ఏళ్లకు పెంచింది.

ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన వారిలో అధికశాతం మంది సమాజ సేవా కార్యక్రమాల్లో విరివిగా పాల్గొంటున్నారు. చాలామంది అప్పటివరకూ తాము పనిచేసిన సంఘాలకు మార్గ దర్శకులుగా ఉండటమో, లేక ప్రత్యక్షంగా పాల్గొనడమో చేస్తున్నారు. కొంతమంది ప్రయివేటు (మిగతా...4లో)

యువతరానికి ఆదర్శం



కామ్రేడ్ చంద్రశేఖరరావు 42 ఏళ్ల సుదీర్ఘమైన సర్వీసు పూర్తి చేసుకొని ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా శ్రీకాకుళం డివిజన్ తరపున హృదయ పూర్వక శుభాకాంక్షలు. 1981లో సంస్థలో చేరిన నాటి నుంచి సంఘ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్నారు. 1984లో ఈడి ఉద్యోగుల పే కమిషన్ నియామకానికి అప్పటి పి-4 యూనియన్ పిలుపు మేరకు జిల్లాలో సమ్మె విజయవంతానికి అప్పటి ఈడి నాయకులతో కలిసి సమ్మె సన్నాహక సమావేశాలు నిర్వహించారు. 2018లో నేను మొట్టమొదటి సారిగా డివిజనల్ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఈ నాలుగేళ్లు నాకు యూనియన్ కార్యకలాపాలపై వెన్నంటే ఉండి ప్రోత్సహించారు. గత నాలుగు నెలల క్రితం తపాలాశాఖ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్ 2022 ఆగస్టు 10న నిర్వహించిన సమ్మెలో ఉత్సాహంగా పాల్గొని నేటి యువతరానికి ఆదర్శప్రాయంగా నిలిచారు. ఆయన సర్వీసులో మొత్తం 54 రోజులు సమ్మె చేశారు. ఆయన శేష జీవితం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

- కె.గణపతి, రాష్ట్ర సహాయ కార్యదర్శి అండ్ డివిజన్ కార్యదర్శి, ఎఐపిఇయు గ్రూప్-సి, శ్రీకాకుళం డివిజన్

అంకితభావంతో పనిచేశారు



కామ్రేడ్ చంద్రశేఖరరావు సుదీర్ఘమైన సర్వీసు పూర్తి చేసుకుని ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా ఆయనకు నా తరపున, మా రాష్ట్ర సంఘం, విజయనగరం డివిజన్ తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం. ఆయనతో నాకు 30 ఏళ్లుగా పరిచయం ఉంది. యూనియన్‌పై అంకితభావం, చిత్తశుద్ధి కలిగిన వ్యక్తి. ఒక యూనియన్ కార్యకర్త ఎలా ఉండాలి అనేదానికి చంద్రశేఖరరావు మంచి ఉదాహరణ. యూనియన్‌లో ఎటువంటి పదవులను ఆశించకుండా నిస్వార్థంగా పనిచేసిన వ్యక్తి. ఆయన శేష జీవితం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

- ఇ.శంకర్‌నాయుడు, రాష్ట్ర అధ్యక్షులు అండ్ డివిజన్ కార్యదర్శి, ఎఐపిఇయు గ్రూప్-సి, విజయనగరం డివిజన్

సౌమ్యుడు చంద్రశేఖరరావు



నాకున్న కొద్ది మంది మిత్రుల్లో చంద్రశేఖరరావు ఒకరు. సౌమ్యులు, ఆలోచన పరుడు. జ్యోతీశ్వరరావుతో కలిసి పోస్టల్ ఉద్యోగుల బాగోగులు గురించి నిస్వార్థంగా చేశారు. వారిరువు తలచుకుంటే ఉన్నత శిఖరాలను చేరుకునేవారు. కానీ, వారిద్దరు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడం వారి జీవిత పరమావధిగా భావించారు. మా ఇద్దరి పరిచయం ఇంటర్మీడియట్‌లో సోంపేట జూనియర్ కళాశాలలో. మేమిద్దరం భౌతికశాస్త్రంలో పోటాపోటీగా ఉండేవాళ్లం. అప్పటి నుంచి ఇప్పటి వరకు మా స్నేహం కొనసాగుతూనే ఉంది. ఉద్యోగ విరమణ తర్వాత శేష జీవితం అతని ఆలోచనలకు అనుగుణంగా జరగాలి. ఆరోగ్యంగా ఉండాలి.

- డాక్టర్ కృష్ణమూర్తి, చిన్ననాటి స్నేహితుడు

మృదుస్వభావి



చంద్రశేఖరరావు పోస్టల్ ఉద్యోగ సంఘం నాయకుడిగా వివిధ శాఖల ఉద్యోగులకూ పరిచయం ఉన్న వ్యక్తి. సహచరులకు ఆదర్శవంతమైన మిత్రునిగా పోస్టల్ యూనియన్‌పై నాయకత్వానికి విశ్వాసపాత్రమైన డివిజన్ యూనియన్ ప్రతినిధిగా, పోస్టల్ యాజమాన్యానికి ముక్కు సూటిగా పోయే వ్యక్తి. నికార్సైన ఉద్యోగిగా తన సేవలు అనందించడానికి ఇష్టపడే మనస్తత్వం. గౌరవప్రదమైన కుటుంబ నేపథ్యం, మృధుస్వభావం తనకు సహజాభరణాలు. నాలుగు దశాబ్దాలకు పైగా మచ్చలేని సర్వీసు ఆయన వ్యక్తిత్వానికి తార్కాణం. శేష జీవితం తాను కోరుకునే కార్మిక సంక్షేమానికి, సామాజిక జీవన సమతుల్యతకు ఉపయోగపడే విధంగా మలచుకుంటారని ఆశిస్తున్నాను.

- వి.జి.కె.మూర్తి, శ్రీకాకుళం

చంద్రశేఖర్ సేవలు మరువలేనివి



కామ్రేడ్ చంద్రశేఖరరావు సుదీర్ఘ కాలం తపాలా శాఖలో విధి నిర్వహణ చేస్తూనే ఉద్యోగుల సంఘంలో ప్రధాన పాత్రపోషించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎనలేని సేవలు చేశారని తెలిపారు. తపాలాశాఖలో ప్రతి చిన్న పొరపాటుకు క్రమశిక్షణా చర్యలపై అధికారులు తీసుకునే విషయం మామూలే. కానీ, ఎలాంటి క్రమశిక్షణ చర్యలకు ఆస్కారం లేకుండా ఉద్యోగ విరమణ చేయడం ఆయన క్రమ శిక్షణకు నిదర్శనం. 2000లో దేశవ్యాప్తంగా జరిగిన తపాల ఉద్యోగుల నిరవధిక సమ్మెను శ్రీకాకుళంలో విజయవంతం చేయడంలో చంద్రశేఖరరావు ప్రధాన పాత్ర పోషించారు. అఖిల భారత మహాసభల్లో పాల్గొన్న సందర్భంగా ఆయా రాష్ట్రాల్లో తపాలా ఉద్యోగుల పోరాటాలను విజయ వంతం చేసేందుకు చేపట్టిన ఎత్తు గడలను తెలుసుకునేందుకు ఉత్సాహం చూపేవారు. అప్పటి సిపిఎం జిల్లా కార్యదర్శి చౌదరి తేజేశ్వరరావుని చంద్రశేఖరావు ద్వారానే కలిశాను. నేను అడగకముందే చంద్రశేఖర్‌లో నాయకత్వ లక్షణాలు మెండుగా ఉన్నాయని తెలుసుకున్నాను.

- సిహెచ్.నాగభూషణం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 111 సర్కిల్ మాజీ కార్యదర్శి, నెల్లూరు

చైతన్యం కల్పిచేవారు



కామ్రేడ్ చంద్రశేఖరరావు ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా హృదయ పూర్వకంగా అభినందనలు తెలియచేస్తున్నాను. చంద్రశేఖర్‌తో నాకు పరిచయం 30 ఏళ్లు. చంద్రశేఖర్, కామ్రేడ్ జ్యోతీఈశ్వరరావు వారిద్దరూ మంచి మిత్రులు. మేము వారిద్దరినీ బారువా బ్రదర్స్ అని పిలిచే వాళ్లం. కామ్రేడ్ లక్ష్మయ్య రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న సమయంలో రాష్ట్ర సంఘానికి చేదోడు, వాదోడుగా ఉండేవారు. పోస్టల్ ఉద్యోగిగా తపాలా కార్మిక ఉద్యమంలో చైతన్యవంతంగా పాల్గొన్నారు. వామపక్ష, ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. చంద్రశేఖర్ విశ్రాంత జీవితం ఆరోగ్యకరంగా, ఆనందకరంగా ఉండాలని కాంక్షిస్తూ... హృదయపూర్వక శుభాకాంక్షలు.

- డి.ఎ.ఎస్.వి ప్రసాద్, అఖిల భారత తపాల ఉద్యోగుల సంఘం గ్రూప్-సి రాష్ట్ర మాజీ కార్యదర్శి

చంద్రశేఖర్ సేవలు ప్రశంసనీయం




చంద్రశేఖరరావు ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. పోస్టల్ ఉద్యోగుల ఉద్యమానికి ఆయన సేవలు ప్రశంసనీయమైనవి. సంఘీభావ ఉద్యమాలకు కూడా ఆయన సహాయం అందించేవారు. ఉద్యోగ విరమణ పొందిన తర్వాత కూడా ఆయన ఈ వరవడి కొనసాగిస్తారని ఆశిస్తూ శుభాకాంక్షలు.

- కె.శ్రీనివాసు, సిఐటియు సీనియర్ నాయకులు



కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ, కార్మిక సమాఖ్య చలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొన్న చంద్రశేఖరరావు


గ్యాంగ్ టక్ సందర్శనలో కుటుంబసభ్యులతో చంద్రశేఖరరావు


ఎన్ఎఫ్పిఇ విశాఖపట్నం రీజియన్ నాయకులు చేపట్టిన ర్యాలీలో







సోంపేటలో ఎన్ఎఫ్పిఇ సంఘాల డివిజన్ కాన్ఫరెన్స్లో మాట్లాడుతున్న చంద్రశేఖరరావు




చలో పార్లమెంట్ ర్యాలీలో కామ్రేడ్ కె.రాఘవేంద్రన్, శివన్నారాయణలతో


కామ్రేడ్ కష్ణన్తో చంద్రశేఖరరావు




బాల్య మిత్రుడు భాస్కరరావు కుటుంబంతో..


భార్య హేమలతతో...


చంద్రశేఖరరావు తండ్రితో పెద్ద కుమార్తె సరిత


కుటుంబసభ్యులతో...

ప్రణాళికలతో మలి జీవితం ప్రశాంతం

(2వ పేజీ తరువాయి)

ఉద్యోగమో, వ్యాపారమో చేస్తూ కుటుంబానికి ఆర్థికంగా తోడ్పాటునం దిస్తున్నారు. మొత్తంగా రిటైర్‌మెంట్ ఉద్యోగానికే తప్ప పనికి కాదని రుజువు చేస్తున్నారు.

గతంలో ఉద్యోగ విరమణ తరువాత చాలామంది ఇంటి వద్దే విశ్రాంతి తీసుకునేవారు. ఇన్నాళ్లు కష్టపడ్డాం.. ఇక విశ్రాంతి తీసుకుందామనే ఉద్దేశం ఉండేది. రానురాను సమాజం మారుతోంది. సమాజంతోపాటు వ్యక్తుల బాధ్యతలు కూడా అధికమవుతున్నాయి. మనుషుల ఆలోచనా విధానంలోనూ మార్పు కనిపిస్తోంది. సమాజానికి ఏదో తనవంతు కృషి చేయాలనే దృక్పథం కొందరిలో ఉంటే, కుటుంబానికి మరింత చేదోడుగా ఉండాలనే ఆలోచన మరికొందరిలో వస్తుంది. ధరల పెరుగుదల కూడా ఒక కారణం. ఉద్యోగవిరమణ అయిన తరువాత ఇంటి వద్దే ఉండకుండా, ఎంతోకొంత సంపాదించి ఆర్థికంగా కుటుంబాన్ని



ఆదుకుంటున్నారు. కొన్నేళ్లుగా ఉద్యోగ విరమణ చేసిన వారిలో ఎక్కువశాతంమంది ఏదో పనిచేస్తున్నారు. ఆరోగ్య రీత్యా ఇబ్బందులు ఉన్న వ్యక్తులు మినహా నేడు అత్యధికులు ఏదో ఒక వ్యాపకం పెట్టుకుంటున్నారు.

ఉద్యోగ విరమణ తరువాత చాలామంది అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీరి సమస్యల పరిష్కారానికి పెన్షనర్ల అసోసియేషన్ ఏర్పడింది. సమస్యలు ఎదురయ్యేట ప్పుడు వీరు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఉద్యమాల్లో పాల్గొనేటప్పుడు తమ జీవిత అనుభవాలను కార్మికులకు వివరించి వారిలో నూతన శక్తిని కలిగిస్తున్నారు. సేవా దృక్పథం ఉన్న వారు ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటుచేయించి సేవలందిస్తున్నారు. సమాజంలో జరుగు తున్న అన్యాయంపై మరికొందరు సమరభేరి మోగిస్తు న్నారు. ప్రజల్లో చైతన్యం కలిగించి పలు పోరాటాలు చేస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నారు. అన్యాయం జరిగిన చోటు కు వెళ్లి నిలదీస్తున్నారు. ప్రజల్లో ఓ రకమైన చైతన్యస్ఫూర్తిని కలిగిస్తున్నారు. ఉద్యోగ విరమణ పొందాక తమకొచ్చే కొద్దిపాటి పెన్షన్‌లో కొంతభాగాన్ని పేదలకు ఖర్చు చేసి కొంతమంది తమ ఉదారతను చాటుకుంటున్నారు. రిటైరయ్యామనే భావన ఈ రోజుల్లో చాలామందిలో కనిపించడం లేదు.